నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 96 | పేజీలు: 4 | వెల: 4/- | మంగళవారం ● 29, అక్టోబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

విద్యుత్ ఛార్జీల పెంపు ప్రతిపాదనలు తిరస్కరణ

- ఈఆర్సీ చైర్మన్ శ్రీరంగారావు వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్ 28(నమస్తే ఉదయం): రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను తిరస్కరించినట్లు ఈఆర్సీ కమిషన్ చైర్మన్ శ్రీరంగరావు స్పష్టం చేశారు. రూ.1800కోట్ల పెంపునకు డిస్కంలు ప్రతిపాదనలు సమర్పించగా, ఆయా ప్రతిపాదనలను ఈఆర్సీ తిరస్కరించింది. దీంతో విద్యుత్తు ఛార్జీల పెంపునకు బ్రేక్‌పడింది. సోమవారం ఎర్రగడ్డలోని విద్యుత్తు నియంత్రణ్ భవన్‌లో ఈఆర్సీ చైర్మన్ శ్రీరంగారావు, సభ్యులు బండారు కృష్ణయ్య, మనోహర్‌రాజులు ఈఆర్సీ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. డిస్కంలు ప్రతిపాదించిన ఛార్జీల పెంపు ప్రతిపాదనలను తిరస్కరించామని, ఛార్జీల్లో ఎలాంటి మార్పులుండవని ప్రకటించారు. అయితే కొన్ని కేటగిరిల్లో మార్పులతో 0.47శాతం టారిఫ్ రేట్లు పెరిగాయని వారు వివరించారు. దీంతో సామాన్య, మధ్యతరగతి వారిపై భారం పడదని వివరించారు. అయితే కొన్ని కేటగిరి వినియోగదారుల ఫిక్స్‌డ్ ఛార్జీలను పెంచినట్లు తెలిపారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా సి.నారాయణరెడ్డి

బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ సి.నారాయణ రెడ్డి

రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28(నమస్తే ఉదయం): రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా సి.నారాయణ రెడ్డి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్దకు చేరుకున్న నూతన జిల్లా పాలనాధికారికి అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ సాదరంగా స్వాగతం పలికారు.

నేరుగా తన చాంబర్‌కు చేరుకున్న కలెక్టర్ అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. కొత్త కలెక్టర్‌కు అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, కలెక్టరేట్ ఏ.ఓ సునీల్, కలెక్టర్‌కు పూల బొకేలు అందించి స్వాగతం పలికారు.

రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరిస్తున్న నారాయణరెడ్డి

చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారి పూజలకు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం

చార్మినార్, అక్టోబర్ 28 (నమస్తే ఉదయం): చారిత్రాత్మక చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి ఆలయంలో జరగనున్న దీపావళి ఉత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డిని ఆలయ ట్రస్ట్ శశికళ ఆహ్వానించారు. దీపావళి సందర్భంగా ఆలయంలో ఈ నెల 29,30,31 తేదీలలో లక్ష్మి పూజలు నిర్వహిస్తున్నట్లు శశికళ తెలిపారు. సీఎం ఎ.రేవంత్ రెడ్డికి చార్మి నార్ శ్రీభాగ్యలక్ష్మి మందిరం ట్రస్టీ శశికళ, సూర్యప్రకాశ్‌లు ఆహ్వాన పత్రిక అందజేశారు.

సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయ ట్రస్ట్ శశికళ

తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీ

- రంగారెడ్డి కలెక్టర్‌గా నారాయణరెడ్డి
- నల్గొండ జిల్లా కలెక్టర్‌గా త్రిపాఠి
- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా హనుమంతరావు

హైదరాబాద్,అక్టోబర్ 28 (నమస్తే ఉదయం): తెలంగాణలో భారీగా ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రంగారెడ్డి కలెక్టర్‌గా నారాయణరెడ్డి, నల్గొండ జిల్లా కలెక్టర్‌గా త్రిపాఠి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా హను మంతరావు నియమితులయ్యారు. బదిలీ అయిన ఐఏఎస్‌ల వివరాలను పరిశీలిస్తే.. టి.కె.శ్రీదేవి – పురపాలక శాఖ డైరెక్టర్, మంద మకరందు – సీసీఎల్ఏ ప్రాజెక్టు డైరెక్టర్, జెడ్.కె. హను మంతులు–పర్యాటకశాఖ డైరెక్టర్, దేవాదాయశాఖ సంచాలకులుగా జెడ్.కె. హనుమంతులకు అదనపు బాధ్యతలు, శశాంక–రాష్ట్ర ప్రాధాన్య ప్రాజెక్టుల కమిషనర్, ఎస్.హరీశ్ – ఐ అండ్ పీఆర్ ప్రత్యేక కమిషనర్, హరీశ్‌కు విపత్తు నిర్వ హణశాఖ సంయుక్త కార్యదర్శిగా అదనపు బాధ్యతలు, వినయ్‌కృష్ణారెడ్డి – ఆర్ అండ్ ఆర్ భూసేకరణ కమిషనర్, ఆయేషా మస్రత్ – వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి, వాణిజ్య పన్నుల శాఖ అదనపు కమిషనర్‌గా నిఖిల్ చక్రవర్తికి అదనపు బాధ్యతలు, కె. చంద్రశేఖర్‌రెడ్డి – డెయిరీ కార్పొరేషన్ ఎండీ,ఎస్.దిలీప్‌కుమార్–నిజామా బాద్ మున్సిపల్ కమిషనర్, సోని బాలదేవి– క్రీడా శాఖ సంచాలకులు (అదనపు బాధ్యతలు) కొర్రా లక్ష్మి – రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఎండీ, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్‌గా కొర్రాలక్ష్మికి అదనపు బాధ్యతలు, ఎన్.క్షితిజ–ఎస్సీ అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ, సుభద్రా దేవి – జీహెచ్ఎంసీ అర్బన్ ఫారెస్ట్రీ అదనపు కమిషనర్, జి.జ్ఞానేశ్వర్– వికారాబాద్ డీఎఫ్ఓగా నియమితు లయ్యారు.

సిఎం రేవంత్ ఇంటివద్ద భద్రతా మార్పులు

- బెటాలియన్ పోలీస్ సిబ్బందిని తొలగింపు
- ఆర్మ్‌డ్ రిజర్వ్ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు
- సిఎం సెక్యూరిటీ వింగ్ కీలక నిర్ణయం

హైదరాబాద్,అక్టోబర్ 28(నమస్తే ఉదయం): జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం వద్ద భద్రతా ఏర్పాట్లలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పటివరకు సీఎం ఇంటివద్ద బందోబస్తు విధులు నిర్వహించిన బెటాలియన్ పోలీస్ సిబ్బందిని సీఎం సెక్యూరిటీ వింగ్ తప్పించింది. వారి స్థానంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) సిబ్బందితో భద్రత కల్పించింది. సీఎం ఇంటికి మూడు వైపులా ఉన్న 22 మంది టీజీఎస్‌పీ సిబ్బం దిని మార్చి ఏఆర్ సిబ్బందిని నియమించారు. గత కొన్ని రోజులుగా బెటాలియన్ పోలీసులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు ఈ మార్పులు చేశారు. హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీసులు నిరసనలు చేస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బెటాలియన్ పోలీసుల నిరసనలు, ధర్నాలతో హోరెత్తిస్తుండడంతో ఇంటెలిజెన్స్ పోలీసులు అలర్ట్ అయ్యారు. ఇంటెలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సెక్యూరిటీలో ఉన్నతాధికారులు కీలక మార్పులు చేశారు. ముఖ్యమంత్రి నివాసం వద్ద ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ టీజీఎస్పీ పోలీసులు

కుటుంబసభ్యులతో కలిసి పెద్దఎత్తున నిరసనలు చేస్తున్న సంగతి తెలిసిందే. దీంతో నిరసనలు చేస్తూ నిబంధలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ క్రమ శిక్షణా చర్యల పేరుతో 39 మంది హెడ్‌కానిస్టేబుళు ్ల, కానిస్టేబుళ్లను శనివారం నాడు పోలీస్ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆదివారం నాడు ఏఆర్ ఎస్సై, మరో హెడ్ కానిస్టేబుల్ సహా ఏకంగా 10 మందిని ఉద్యోగాల నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయినప్పటికీ వీరి ఆందోళనలు మాత్రం ఆగడం లేదు. తమకు వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలని బెటాలియన్ పోలీసులు ఆందోళనలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి నివాసం వద్ద ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ ఏడాది జనవరిలోనూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రతా సిబ్బందిని మార్చివేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అప్పుడు ఉన్న భద్రతా సిబ్బందిలో ఎక్కువ మంది గత సీఎం కేసీఆర్ వద్ద పని చేసిన వారే. అయితే ముఖ్యమంత్రి కార్యాలయం, ఆయనకు సంబంధించిన వ్యక్తిగత, అధికారిక సమాచారం బయటకు వెళ్తోందని మార్పులు చేశారు. పాత వారిని తొలగిస్తూ కొత్త భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశారు. అయితే సమాచారం బయటకు వెళ్లడంపై సీఎంవో, ఇంటెలిజెన్స్ అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు అప్పుడు భారీగా మార్పులు చేశారు.

అలాగే ప్రస్తుతం టీజీఎస్పీ పోలీసుల నిరసనల నేపథ్యంలో ఉన్నతాధికారులు ముందుగానే అప్ర మత్తం అయ్యారు.

వచ్చే ఏడాది నుంచి జనాభా లెక్కలు షురూ

- 2026 కొనసాగనున్న ప్రక్రియ
- చివరిసారిగా 2011లో లెక్కలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 28 (నమస్తే ఉదయం): దేశంలో జనగణన జరపాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రక్రియ 2025లో ప్రారంభం అవుతుందని సంబంధిత వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఇది 2026 వరకూ కొనసాగనున్నట్లు పేర్కొన్నాయి. ఈ ప్రక్రియ అనంతరం లోక్‌సభ స్థానాల విభజన ప్రక్రియ ఉంటుందని తెలిపాయి. అది 2028కి ముగుస్తుందని వెల్లడించాయి. జనగణన పూర్తి కావడానికి దాదాపు 18 నెలల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హోంశాఖ ఈ ప్రక్రియకు నేతృత్వం మిగతా.. 2లో

పిఎసి సమావేశాన్ని బహిష్కరించిన బిఆర్ఎస్

- నిబంధనలకు విరుద్ధంగా పిఎసి నియామకం
- విపక్షనేత కెసిఆర్ సూచించిన వారినే చైర్మన్ చేయాలి
- మీడియా సమావేశంలో మాజీమంత్రి వేముల

హైదరాబాద్,అక్టోబర్ 28(నమస్తే ఉదయం): పబ్లిక్ అకౌంట్స్ కమిటీ మీటింగ్‌ను బీఆర్ఎస్ బాయ్ కాట్ చేసింది. అసెంబ్లీ సంప్రదాయా లకు విరుద్ధంగా పీఏసీ చైర్మన్‌ను నియమిం చారని బీఆర్ఎస్ ఆరోపించింది. పీఏసీ సమావేశంలో బీఆర్ఎస్ సభ్యులు వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎల్.రమణ నిరసన తెలిపారు. అనంతరం తెలంగాణ భవన్‌లో గులాబీ నేతలు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ పార్టీ ఎవరిని సూచిస్తే వారిని పీఏసీ చైర్మన్‌గా కేసీఆర్ నియమించారని మాజీమంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. క్రిష్ణారెడ్డి, గీతారెడ్డిని పీఏసీ చైర్మన్లుగా చేశామన్నారు. కేంద్రంలో రాహుల్ మిగతా.. 2లో

నా గురువు, నా మెంటార్, నా స్ఫూర్తిదాత

- అమితాబ్ బచ్చన్‌పై చిరంజీవి పొగడ్తలు
- చిరంజీవికి అక్కినేని పురస్కారం అందచేత
- అమితాబ్ చేతుల మీదుగా అవార్డు ప్రదానం

హైదరాబాద్,అక్టోబర్ 28(నమస్తే ఉదయం): ం నా గురువు, నా మెంటార్, నా స్ఫూర్తిదాత అమితాబ్ బచ్చన్ అంటూ..ఆయనకు అగ్ర నటుడు మెగాస్టార్ చిరంజీవి ధన్యవాదాలు తెలిపారు. నాకు ఎప్పుడు ఏ మంచి జరిగినా, నాకు ఎప్పుడైనా అవార్డు వచ్చినా ఆయన నుంచే తొలుతగా నాకు శుభాకాంక్షలు వస్తాయని గుర్తుచేసుకున్నారు. కొన్నిసార్లు ఇలా వచ్చి ఆశీర్వదిస్తుంటారు. ఆయన లాంటి బిగ్ స్టార్ నాకు ఈ అవార్డు ప్రదానం చేయడం ఆనందదాయకం అని ప్రముఖ కథానాయకుడు చిరంజీవి అన్నారు. ఏఎన్నార్ జాతీయ పురస్కారాన్ని ప్రముఖ నటుడు అమితాబ్ మిగతా.. 2లో

సచివాలయం వద్ద 144 సెక్షన్ అమలు

హైదరాబాద్,అక్టోబర్28(నమస్తే ఉదయం): తెలంగాణ సచివాలయపరిధిలో ఆంక్షలు విధించారు. ముట్టడి చర్యలతో అప్రమత్తమైన ప్రభుత్వం ఆంక్షలు విధించింది. సచివాలయ భద్రతా సిబ్బందికి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీఎస్‌వో) పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

సచివాలయం చుట్టూ 2 కి.మీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. సిబ్బంది కదలికలు, సోషల్ మీడియాపై నిఘా ఉందన్నారు. పోలీసు అధికారులపై రెచ్చగొట్టే పోస్టులు పెట్టే వాట్సప్ గ్రూపుల నుంచి ఎగ్జిట్ కావాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం, పోలీసు శాఖకు వ్యతిరేకంగా ఎలాంటి పోస్టులు షేర్, లైక్ చేయొద్దన్నారు. తప్పు జరిగితే

వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చ రించారు.

రేవంత్ పాలనలో రోడ్డెక్కనిది ఎవరు..?

- 11 నెలల పాలనలో అన్నీ మోసలే
- నిరుద్యోగులకు భృతి లేదు..నియామకాలు లేవు
- ఫీజు రియంబర్స్‌మెంట్..రైతు భరోసా ఏమ్యింది
- ప్రభుత్వం విఫలమై ప్రతిపక్షంపై దాడి చేస్తోంది
- రేవంత్ పాలనపై హరీష్ రావు మండిపాటు

హైదరాబాద్,అక్టోబర్28(నమస్తే ఉదయం): రేవంత్ రెడ్డి నీ పాలనలో.. మోసం చేయనిది ఎవర్ని..? రోడ్డు మీదకు తీసుకురానిది ఎవర్ని..? అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు. అన్ని కోణాల్లో ఈ ప్రభుత్వం విఫలమై దిక్కుతోచక ప్రతిపక్షంపై దాడులు చేస్తు న్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రజాపాలన తొలగిపోయి.. కాంగ్రెస్ పార్టీ వికృతరూపం బట్టబయలైందని తెలిపారు.

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. ఈ రాష్ట్రంలోని విద్యార్థులను, నిరుద్యగులు, ఉద్యోగులను మోసం చేశారని అన్నారు. 2 లక్షల ఉద్యోగాలను ఏడాదిలో భర్తీ చేస్తానని మిగతా.. 2లో

వేణుస్వామిపై చర్యలు తీసుకోండి

- మహిళా కమిషన్‌కు హైకోర్టు ఆదేశాలు
- స్టే ఎత్తివేస్తూ ఉత్తులు

హైదరాబాద్,అక్టోబర్28 (నమస్తే ఉదయం): అక్కినేని–నాగచైతన్య శోభిత ధూళిపాళ్ల వైవాహిక జీవితం సక్రమంగా సాగ దంటూ జాతకం చెప్పిన వేణుస్వామి చిక్కుల్లో పడ్డారు. నాగచైతన్య– శోభిత నిశ్చితార్థం చేసుకున్న రోజునే రంగంలోకి దిగిన వేణుస్వామి మూడేళ్లలో వీరిద్దరూ విడిపోతారని జోస్యం చెప్పారు. మరో మహిళ ప్రమేయం కారణంగా 2027లో ఈ జంట విడిపోతారని అంచనా వేసి వివాదానికి తెరలేపారు. ఈ మేరకు వీరిద్దరి జాతకాలను వేణుస్వామి విశ్లేషణ చేసిన వీడియో బాగా వైరల్ అయ్యింది. దీనిపై తెలుగు ఫిల్మ్ జర్న లిస్ట్ అసోసియేషన్, మిగతా.. 2లో

నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

ఉమ్మడి జిల్లా ఉషూ ఉపాధ్యక్షులుగా మాస్టర్ అబ్దుల్ నబీ

మహబూబ్ నగర్, అక్టోబర్ 28(నమస్తే ఉదయం): ఉమ్మడి జిల్లా ఉషూ ఉపాధ్యక్షులుగా మాస్టర్ అబ్దుల్ నబీ ఎన్నికయ్యారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా నూతన ఉషూ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ, పరిశీలకులు ఇమ్రాన్, రాష్ట్ర ట్రెజ రర్ ఎస్ పరమేష్, బాల రాజ్, చిన్న వీరయ్యల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి వూషూ అసోసియేషన్ ఎంపిక జరిగింది. వైస్ ప్రెసిడెంట్గా అబ్దుల్ నబీలను ఎన్నుకున్నారు. ఈ సంద ర్భంగా మాస్టర్ మాట్లాడుతూ... జిల్లాలో వూషూ ప్రతి విద్యార్థినికి నేర్పించి వారిని జాతీయ అంతర్జాతీయ స్థాయిలలో పథకాలు సాధించే విధంగా కృషి చేస్తానన్నారు. నాకు సహకరించిన నా విజయానికి తోడ్పడిన నా గురువు మాస్టర్ జాంగిర్ పాషా ఖాద్రి, ఉమ్మడి జిల్లా ఆల్ మాస్టర్స్ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా గాడ్స్ ఆన్ వారియర్స్ చోటు ఖాన్ కరాటే అకాడమీ మాస్టర్స్ ఎంఏ ఇఫ్తార్ రఫ్ యుల్లా ఖాద్రీ, వెంకటేష్ ,జి హరీష్ యాదవ్, జాఫర్, సాదిక్ ,జి పరమేష్ , ఎండి ఇంతియాజ్, బి కురుమూర్తి యాదవ్, అరవింద చారి మంజునాథ్, జే సుమ, అనిత ,ఎండి జాంగిర్, పృథ్వీరాజ్ పలువురు మాస్టర్ ని అభినందించారు.

అనారోగ్యానికి గురైన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పారెడ్డిని పరామర్శించిన బండి రమేష్...

కూకట్‌పల్లి,అక్టోబర్ 28 (నమస్తే ఉదయం): కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్ప రెడ్డిని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పరామర్శించారు. పుష్పరెడ్డికి ఇటీవల అనారోగ్యానికి గురై మోకాళ్ళకు ఇటీవలే శస్త్ర చికిత్స చేయిం

చుకున్నారు. బండి రమేష్ బాల నగర్‌లోని ఆమె నివాసంలో సోమవారం కలిసి పరామర్శించారు త్వరగా కోలుకొని పార్టీ కార్యక్రమంలో యధావిధిగా చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి, దినేష్ కుమార్, శ్రీకాంత్ పటేల్, యుగంధర్ ,అస్లాం, అరుణ్, నయూమ్ , కిట్టు, మధు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు నాలుగు డిఏలు, పిఆర్సీ వెంటనే అమలు చేయాలి

రాజేంద్రనగర్, అక్టోబర్ 28 (నమస్తే ఉదయం): ఉపాధ్యాయులకు రావలసిన నాలుగు డీఏ లతోపాటు పిఆర్సీ ని వెంటనే ప్రకటించాలని కోరుతూ సోమవారం టీయూపీఎస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు తహసిల్దార్ కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యారంగ సమస్యలను వివరిం చారు. ప్రభుత్వం యొక్క ఉదాశీనతను తొలగించుకొని, ఎలక్షన్లకు ముందు ప్రకటిం చిన విధంగా ప్రభుత్వం తన బాధ్యతను పూర్తి చేయాలన్నారు. ఉపాధ్యా యుల ఆర్థికపర అంశాలైన ఉపాధ్యాయుల యొక్క పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కొరారు . 4 డీఏ లు వెంబడే విడుదల చేయాలని, పీఆర్సీ కమిటి

తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

నివేదికను వేగవంతం చేసి, త్వరితగతిన అమలు చేయాలన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, లేని యెడల సెప్టెంబర్ 23 న మహా ధర్నాకు పిలుపునిస్తామన్నారు. కార్యక్రమంలో టియుపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు హనుమంత్ రావు, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఖాశీ రావు, మండల భాద్యులు ఏం బాలకృష్ణ, అనిల్, బాలకృష్ణ, టియుపిఎస్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

డెలివరీ బాయ్స్‌కు ఖాళీ సిలిండర్లు ఇవ్వవద్దు.

వారి అకౌంట్లో డబ్బులు వేయవద్దు

ప్రియాంక గ్యాస్ సర్వీసెస్ యజమాని వీ టి. విజయ్ కుమార్

శంషాబాద్ అక్టోబర్ 28(నమస్తే ఉదయం): గ్యాస్ సిలిండర్లు సప్లై చేసే బాయ్స్ కు ఖాళీ సిలిండర్లు అప్పగించరాదని శంషాబాద్‌లోని ప్రియాంక గ్యాస్ సర్వీసెస్ యజమాని వీ టి. విజయ్ కుమార్ తెలిపారు. సిలిండర్లు డోర్ డెలివరీ చేసే బాయ్స్ కు ఖాళీ సిలిండర్లు కానీ వారి వ్యక్తిగత అకౌంట్లో డబ్బులు జమ చేయడం కానీ చేయకూడదని తెలిపారు. గతంలో సంస్థలో పనిచేసే మానివేసిన కొంతమంది డెలివరీ బాయ్స్ కస్టమర్ల ఇళ్ల వద్దకు వెళ్లి ఖాళీ సిలిండర్లు ఇవ్వాలని తర్వాత వాటిని మీకు అప్పగిస్తామని చెబుతున్నట్లు తమకు ఫిర్యాదు వచ్చిందని విజయ్ కుమార్ తెలిపారు. ఎవరికి కూడా ఖాళీ సిలిండర్లు ఇవ్వకూడదని వారు తెలిపారు. దానితోపాటు వారి వ్యక్తిగత అకౌంట్లో డబ్బులు కూడా జమ చేయరాదని సూచించారు. కస్టమర్లకు ఎవరికైనా ఏదైనా అవసరం ఉన్న అనుమానం ఉన్న. 90002 22598 ఫోన్ నెంబర్ కు సంప్రదించాలని వారు సూచించారు. కస్టమర్లు డబ్బులు ఇచ్చిన. ఖాళీ సిలిండర్లు ఇచ్చిన తమకు సంబంధం లేదని అన్నారు. ప్రియాంక గ్యాస్ ఏజెన్సీ పేరు చెప్పి మోసాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

నా గురువు, నా మెంటార్, నా స్ఫూర్తిదాత

(మొదటి పేజీ తరువాయి)

బచ్చన్ చేతుల మీదుగా అందుకున్న తర్వాత చిరంజీవి మాట్లాడారు. అన్నపూర్ణ స్టూడియలో అట్టహాసంగా అవార్డు ప్రదానోత్సవం జరిగింది. ఈ క్రమంలో ఏఎన్నార్, అమితాబ్‌తో తన అనుబంధం గురించి చెప్పుకొచ్చారు. పద్మ భూషణ్ అవార్డు వచ్చినప్పుడు నన్ను సినిమా పరిశ్రమ సన్మానించింది. ఆ సమయంలో అమితాబ్ నా గురించి 'చిరంజీవి కింగ్ ఆఫ్ ఇండియన్ సినిమా' అని చెప్పారు. ఆ మాటలు విన్నాక నాలో చిన్న వణుకు కనిపించింది. నా నోట మాట రాలేదు. నా మనసు అమితానందంతో నిండిదిపోయింది. ఆ రోజు ఆయనకు ధన్యవాదాలు సరిగా చెప్పానో లేదో గుర్తులేదు. అప్పుడు నా పరిస్థితి అలాంటిది. ఇండియన్ సినిమాకి బాద్‌షా, షెహన్ షా, చక్రవర్తి అయిన అమితాబ్ బచ్చన్ నోటి నుంచి ఆ మాటలు రావడం అంటే ఎంత పెద్ద విషయమో కదా. ఆయన మాటలు నన్ను ఎంతో ప్రోత్సాహం ఇచ్చాయి. ఆయన మాటలు నాకు ఎంతో విలువైనవని చిరంజీవి చెప్పారు. నేను 1990లో హిందీలో తొలి సినిమా (ప్రతిబంధ్) చేసినప్పుడు అమితాబ్‌కు చూపించాను. ఆయన సినిమా చూస్తున్నంతసేపూ చాలా ఆందోళనగా ఉన్నాను. ఆయనకు నచ్చుతుందో లేదో అని అనుకుంటూ ఉన్నా. సినిమా అయ్యాక ఆయన వచ్చి 'శక్తివంతమైన నటన నీది, సమాజానికి అవసరమైన సినిమా ఇది' అని మెచ్చుకున్నారు. ఆ మాటలు నాకు ఎంతో శక్తినిచ్చాయి. ఆ సమయంలో నేను పిల్లాడిని అయిపోయి ఆయన మాటలకు సంతోషించాను. నా కెరీర్ ప్రారంభం నుంచి ఆయన నన్ను ప్రోత్సహిస్తున్నారు. ఆయన 70వ జన్మదినం సందర్భంగా ఆయన ఇంటికి వెళ్లినప్పుడు, మా ఇంట్లో శుభకార్యాలకు వచ్చినప్పుడు ఆయన నాపై ఎంతో ప్రేమ చూపిస్తారని తెలిపారు. 'సైరా'లో నా గురువు పాత్ర కోసం అమితాబ్ బచ్చన్‌ను ఎలా సంప్రదించాలా? అని సినిమా టీమ్ ఆలోచిస్తుండగా.. నేను ఆయనకు ఓ మెసేజ్ చేశాను. ఆయన నుంచి రిప్లయ్ రాకపోతే అక్కడితో ఆ ప్రయత్నం ఆపేద్దాం అనుకున్నాను. కానీ ఆయన వెంటనే రెస్పాండ్ అయ్యారు. దాంతో నేను సినిమాలో పాత్ర కోసం చెప్పాను. సినిమాలో మీరు నాకు గురువుగా నటించాలి అని కోరాను. దానికి ఆయన 'నేను చేస్తాను' అని చెప్పారు. మీ కోసం ఎలాంటి ఏర్పాట్లు చేయాలి అని అడిగాను. దానికి ఆయన 'నా గురించి ఎలాంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయనక్కర్లేదు. నేను నా గురించి చూసుకుంటాను' అని చెప్పారు. అదీ ఆయన గొప్పతనం. సినిమా ఆఖరి రోజు 'ఫార్మాలిటీస్' (పారితోషికం) గురించి మొహమాటపడుతూ అడిగాను. దానికి ఆయన 'ఫార్మాలిటీస్ ఏమీ అక్కర్లేదు. నువ్వు నా స్నేహితుడివి. నీ మీద ప్రేమాభిమానాలతో ఈ సినిమా చేస్తున్నాను. నన్ను ఇన్‌సల్ట్ చేయొద్దు' అని అన్నారు. అది ఆయన నా మీద చూపించే అభిమానం అని 'సైరా' రోజుల్ని గుర్తు చేసుకున్నారు చిరంజీవి. అమితాబ్ నుంచి నేను చాలా విషయాలు నేర్చుకున్నాను. అందరి ముందు నా మనసు లోతుల్లోంచి చెబుతున్న మాటలు ఇవి. నేను మీకు ఏమి తిరిగి ఇవ్వగలను. మీకు ధన్యవాదాలు చెప్పడం తప్ప. మీకు ఆ దేవుడు దీర్ఘాయుష్షు, ఆరోగ్యం ఇవ్వాలని కోరుకుంటున్నాను అని చెప్పారు.

'తెలుగులో ఇంట గెలిచి రచ్చ గెలవాలి అని ఓ నానుడి ఉంది. నా విషయంలో రచ్చ గెలిచి ఇప్పుడు ఇంట గెలిచాను ఏమో అనిపిస్తోంది.

నటుడిగా నేను ఎదుగుతున్న సమయంలో బయట ప్రేక్షకులు, సన్నిహితుల నుంచి ప్రశంసలు వచ్చేవి. అయితే ఇంటికి వెళ్లినప్పుడు మా నాన్న సినిమాలు చూసి పొగుడుతారేమో అని అనుకునేవాణ్ని. మా నాన్నకు నటన అంటే చాలా ఇష్టం. అలాంటి మా నాన్న నన్ను ఎందుకు పొగడరు అనిపించేది. ఓ రోజు ఇంటికి వెళ్లినప్పుడు నా కవర్ పేజీలతో కొన్ని పుస్తకాలు చూస్తున్నారు. నేను వెళ్లేసరికి తీసి పక్కన పడేశారు. 'ఫొటోలు బాగున్నాయిరా' అని ఓ మాట అంటారేమో అని అనుకున్నాను. కానీ ఆయన అలా అనలేదు. లోపలకు అమ్మ దగ్గరకు వెళ్లి.. 'ఏంటమ్మా నాన్న ఎప్పుడూ నా గురించి ఓ మాట అనరు, బాగుందని కూడా చెప్పరు' అని అడిగాను. బయట రచ్చ ఎంత గెలిచినా సరే.. ఇంట గెలవడం లేదు అనిపిస్తోంది అని అన్నాను. దానికి అమ్మ 'లేదురా నాన్న చాలా పొగుడుతారు. ఏం చేశాడు నా కొడుకు, అదరగొట్టేశాడు' అని అంటుంటారు అని చెప్పింది. మరి నా దగ్గర ఆ మాటలు అనొచ్చు కదా అని అమ్మను అంటే 'బిడ్డల్ని తల్లిదండ్రుల్ని పొగడకూడదు. అది వారికి ఆయుక్షీణం అని అమ్మ చెప్పింది అని చిరు తెలిపారు. సినిమా పరిశ్రమలో నేను తొలుత రచ్చ గెలిచాను. నా ఇల్లు అనుకునే పరిశ్రమలో నాకు ఆ అవకాశం టాలీవుడ్ వజ్రోత్సవాల సమయంలో వచ్చింది. లెజండరీ పురస్కారం ప్రదానం చేయబోయారు. ఆ సమయంలో చాలా ఆనందమేసి ధన్యుణ్ని అనుకున్నా. కానీ ఆ రోజు కొన్ని ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో కొందరు హర్షించని ఆ సమయంలో ఆ పురస్కారాన్ని తీసుకోవడం సముచితం అనిపించలేదు. అందుకే ఆ రోజు ఆ అవార్డుని ఓ క్యాప్సుల్ బాక్స్‌లో పడేసి.. నాకు అర్హత ఎప్పుడు వస్తుందో అప్పుడు తీసుకుంటాను అని చెప్పాను. అంటే ఆ రోజు నేను ఇంట గెలవలేదు. ఈ రోజు ఏఎన్నార్ అవార్డును అందుకున్న రోజున ఇప్పుడు అనిపిస్తోంది.. 'నేను ఇంట గెలిచాను.. రచ్చ గెలిచాను' అని. అందుకే ఈ పురస్కారం గురించి చెప్పడానికి నాగార్జున, వెంకట్ ఇంటికి వచ్చినప్పుడు నేను చాలా ఆనందించాను. నాకు పద్మభూషణ్, పద్మ విభూషణ్, గిన్నిస్ బుక్‌లో స్థానం.. ఇలాంటివి ఎన్ని వచ్చినా ఈ అవార్డు విషయంలో నా భావోద్వేగం వేరుగా ఉంది. నా వాళ్లు నన్ను గుర్తించి నాకు అవార్డు ఇస్తుండటం నాకు గొప్ప విషయంగా అనిపించింది. అందుకే నాగార్జునతో ఇది నాకు అన్ని పురస్కారాలకు మించిన అవార్డు అని చెప్పా. ఇదే మాట స్టేజీ మీద చెప్పాలి అనుకున్నాను. ఇప్పుడు చెప్పాను అని చిరంజీవి తన ఆనందాన్ని తెలియజేశారు. అమ్మను ఇలా ఫ్రంట్ సీట్‌లో కూర్చోబెట్టడానికి ఓ కారణం ఉంది. ఏఎన్నార్ గారి అభిమానుల్లో సీనియర్ మోస్ట్ ఫ్యాన్ ఎవరన్నా ఉన్నారు అంటే అది అమ్మే. ఎలాంటి ఫ్యాన్ అనేది తెలియాలంటే.. కొన్నేళ్ల క్రితం జరిగిన సంఘటన గురించి చెప్పాలి. అమ్మ మొగల్తూరులో గర్భిణిగా ఉంది. నెలలు నిండి ప్రసవానికి సిద్ధమవుతోంది. ఆమె కడుపులో ఉన్న జీవి.. ఈ చిరంజీవి. ఆ సమయంలో నాన్నను అమ్మ ఓ కోరిక కోరింది. 'నాగేశ్వరరావు సినిమా 'రోజులు మారాయి' రిలీజైంది. నేను వెళ్లి చూడాలి. మళ్లీ తర్వాత అంటే కుదరదు. ప్రసవం అయితే బయటకు పంపరు' అని అంది. బస్సు వసతులు సరిగ్గా లేకపోవడంతో జట్కా బండి ఏర్పాటు చేశారు నాన్న. బండిలో వెళు ్తండగా.. బస్సుకు దారిచ్చే క్రమంలో తిరగబడింది. మొత్తంగా పొలంలో బండి సహా అమ్మ, నాన్న తిరగబడ్డారు. దీంతో తిరిగి ఇంటికి వెళ్లిపోదాం' అని నాన్న అంటే.. 'లేదు లేదు నేను సినిమాకు వెళ్లాల్సిందే' అని పంతం పట్టి సినిమా చూసింది. అంత పిచ్చి అమ్మకు సినిమాలంటే.. అందులోనూ నాగేశ్వరరావు సినిమాలు అంటే మరీ అభిమానం అని చిరు చెప్పారు. నాగేశ్వరరావు అంటే అమ్మకు ఉన్న అభిమానం.. రక్తం ద్వారా నాకు వచ్చిందేమో అనిపిస్తుంటుంది. ఆయన డ్యాన్స్‌లు అంటే నాకు చాలా ఇష్టం. ఆయన సినిమాల్లో పాటలు వస్తే చూస్తూ, అనుకరిస్తూ డ్యాన్స్‌లు వేసేవాణ్ని. అలాంటి ఏఎన్నార్‌గారు నా గురించి గొప్పగా మాట్లాడారు. 'నాకు ఎముకలు ఉన్నాయి, కానీ చిరంజీవికి ఎముకలు లేవని ఓసారి అన్నారు. మరో సందర్భంలో 'నేను డ్యాన్సులు వేయడానికి ఆధ్యుణ్ని. ఆ డ్యాన్స్‌లకు స్పీడ్, గ్రేస్ పెంచింది చిరంజీవే. హీరోయిన్లతో చిరు డ్యాన్స్ వేస్తుంటే నేను ఆయన్నే చూస్తాను' అని ఏఎన్నార్ చెప్పారు. అంతలా నన్ను ఆయన అభిమానించేవారు' అని ఏఎన్నార్‌ని చిరంజీవి గుర్తు చేసుకున్నారు. మేం చెన్నై నుంచి షూటింగ్‌కి వచ్చినప్పుడు అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఆయన ప్రత్యేకంగా వచ్చి కలిసేవారు. మీ లాంటి యువ నటులు మద్రాసు నుంచి ఇక్కడకు వచ్చేయాలి. అప్పుడే పరిశ్రమ నిజంగా ఆంధ్రప్రదేశ్ బదిలీ అయింది అనిపిస్తుంది అని ప్రోత్సహిస్తుండేవారు. అప్పుడు ఆయన చేసిన కృషి ఫలితాన్నే ఇప్పుడు మనం అనుభవిస్తున్నాం. 'కాలేజీ బుల్లోడు' వంద రోజుల ఫంక్షన్‌కు నన్ను పిలిచారు. ఆయన వెనుక సీట్‌లో నేను కూర్చుని ఉన్నా. ప్రేక్షకులు పెద్ద ఎత్తున కేరింతలు కొడుతున్నారు. చాలాసేపు అయినా ఆ ఉత్సాహం ఆగలేదు. దాంతో ఆయన నావైపు తిరిగి 'ఆ కేరింతలు నీ కోసమే.. లేవు పైకి ప్రేక్షకుల్ని పలకరించు' అని అన్నారు. 'వద్దలెండి సర్' అని నేనంటే.. 'ఏంటయ్యా మొహమాటం పడతావ్.. మీరు ముందుండాలి.. రా ముందుకు రా' అని నాతో అభివాదం చేయించారు. మామూలుగా అయితే అలాంటి సమయంలో సీనియర్ నటులు ఎవరైనా ప్రశంసల్ని ఇంకొకరికి షేర్ చేయడం కాస్త సంశయిస్తారు. కానీ ఆయన నన్ను ప్రోత్సహించారు. అదీ ఆయన గొప్ప మనసు' అని చిరంజీవి ఏఎన్నార్‌తో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 'మెకానిక్ అల్లుడు'లో కలసి నటించినప్పుడు ఆయన నుంచి ఎన్నో మంచి విషయాలు, ఎలా నడుచుకోవాలి అనే విషయాలను నేర్చుకున్నా. ఆ సినిమాకు నాకో గొప్ప అనుభూతి. ఆ సమయంలో ఆయన్ను చూస్తే నడిచి వచ్చే ఎన్‌సైక్లోపీడియా అని అనిపించేది. ఆయనతో మాట్లాడినప్పుడు ఎంతో సరదాగా కలిసిపోయేవారు. విదేశాలకు షూటింగ్‌లకు వెళ్లినప్పుడు ఆయన కోసం చిన్నపాటి గిఫ్ట్‌లు తెచ్చేవాణ్ని. నేను రాజకీయాల్లోకి వెళ్లిన తర్వాత కూడా ఆయనతో మాట్లాడేవాణ్ని. పరిశ్రమల గురించి, రాజకీయ పరిస్థితుల గురించి ఆయనతో చర్చించేవాడిని. ఆయనంటే నాకు పితృసమానులు. ఈ విషయం నేను బయట ఎక్కడా చెప్పే అవకాశం రాలేదు. ఇప్పుడు ఇక్కడ చెబుతున్నా. ఆ అభిమానం.. ఆ తర్వాత నాగార్జున మీద చూపిస్తున్నాను. నా గురించి, నా ఆరోగ్యం గురించి నాగార్జునతో అంతే అభిమానంగా చర్చిస్తూ ఉంటా. నాగార్జున నాకు ఆరోగ్య సూత్రాలు తెలిపే డాక్టర్ కూడా. నేను ఇప్పటికీ యంగ్‌గా, సరదాగా ఉన్నానంటే కారణం నాగార్జున కూడా. ఆహారం, ఆరోగ్యం విషయంలో ఎప్పుడూ సలహాలు ఇస్తూ ఉంటారు. అందుకే నేను కూడా గుడ్డిగా ఫాలో అయిపోతుంటాను. ఆ భగవంతుడు నాకిచ్చిన అద్భుతమైన స్నేహితుడు నాగార్జున. అఖిల్ నన్ను పెదనాన్న అని పిలుస్తుంటాడు. ఆ మాట వింటుంటే పుత్రవాత్సల్యం అనిపిస్తోంది. వాడు నాకు మరో బిడ్డ లాంటివాడు. అక్కినేని కుటుంబం మొత్తం మా కుటుంబ సభ్యుల్లాంటివారే. మా కుటుంబం పట్ల అక్కినేని కుటుంబం చూపించే ప్రేమకు నేను దాసుడిని. ఆ ప్రేమను నా జీవితాంతం పదిలపరుచుకుంటా. నాగ్ లాంటి స్నేహితుణ్ని నా మనసులో పదిలం చేసుకుంటాను' అని చిరంజీవి అన్నారు. అక్కినేని పురస్కారం నాకు రావడం ఎంతో ఆనందంగా ఉంది. దేవానంద్, లతా మంగేష్కర్, అమితాబ్ బచ్చన్, రేఖ, హేమ మాలిని, కె.బాలచందర్ లాంటి గొప్పవాళ్లకు ఇచ్చిన పురస్కారం నాకు దక్కడం నా పూర్వ జన్మ సుకృతం. ఈ అవార్డు రావడం నా సినీ జీవితానికి పరిపూర్ణత ఇచ్చింది అని చెప్పాలి. నా జీవితాంతం ఈ అనుభూతిని మనసులో పెట్టుకుంటాను' అని చిరంజీవి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ పురస్కారాన్ని నాకు ఇవ్వడం సముచితం అని భావించి నాకు ఇచ్చిన ఏఎన్నార్ అవార్డు కమిటీకి, ఛైర్మన్ సుబ్బరామిరెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను' అని చిరంజీవి ప్రసంగం ముగించారు.

రేవంత్ పాలనలో రోడ్డెక్కనిది ఎవరు..?

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. నిరుద్యోగులకు 4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని మాయమాటలు చెప్పి నట్టేట ముంచారు. ఇక కాంగ్రెస్ ఏడాది పాలనకు ఒక్క నెల మిగిలింది. కనీసం 10 శాతం అంటే 20 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చావా..? నిరుద్యోగులను దగా చేశావు. నిరుద్యోగ భృతిపై అసెంబ్లీలో అడిగితే హామీ ఇవ్వలేదని రేవంత్ రెడ్డి మోసపు మాటలు మాట్లాడారు. విద్యార్థులకు భరోసా కార్డు ఇస్తా అన్నావు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఇప్పటి వరకు కూడా నయా పైసా ఇవ్వలేదు. దివంగత సీఎం రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కేసీఆర్ మానవీకోణంలో ఆలోచించి కొనసాగించారు. ककాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వలేదు. విద్యార్థుల బతుకులు ఆగం అవుతుంటే.. నీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగులకు మూడు డీఏలు ఇస్తానని మాటిచ్చావు. పెండింగ్‌లో బిల్లులు క్లియర్ చేస్తా అన్నావు. పీఆర్సీ ప్రకటించి వేతనాలు పెంచుతానని ప్రకటించావు. ఇందులో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదు. పీఆర్సీ ఉలుకే లేదు. ఒక్క డీఏ ఇచ్చి దీపావళి పండుగ జరుపుకోండి అంటున్నారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ నిర్ణయించిన డీఏనే ఇప్పుడి స్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 15 డీఏలు ఇచ్చింది. ఐదు డీఏలు పెండింగ్‌లో ఉండే.. కనీసం మూడు అయినా ఇస్తావు అనుకుంటే.. ఒక్క డీఏతో సర్దిపెడుతున్నావు. పీఆర్సీ ఇవ్వక, ఓపీఎస్ అమలు చేయక, 317 జీవో పరిష్కరించకుండా ఉద్యోగులను మోసం చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం చేశారు. 6 వేల మంది టీచర్లు పదవీ విరమణ పొందారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌లో వారికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మూడేండ్లకు నాలుగేండ్లకు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఏదైనా ఉందా అంటే అది కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వమే అని హరీశ్‌రావు తెలిపారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి వికృతరూపాన్ని చూసి ప్రజలు విస్తుపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో 11 నెలల రేవంత్ రెడ్డి పాలన చూస్తే ప్రజా పాలన కాదు ప్రజా పీడనగా కనబడుతుంది. ప్రజా పాలన తొలిగిపోయి కాంగ్రెస్ పార్టీ వికృతరూపం బట్టబయటలైంది. ఏ వర్గానికి తామిచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయింది. సీఎం వికృతరూపాన్ని చూసి ప్రజలు విస్తుపోతున్నారు. రాష్ట్రంలో ఎక్కడా చూసినా ధర్నాలతో అట్టుడికి పోతోందని అన్నారు. దర్నాలు చేస్తున్న వారిని చర్చలకు పిలవొచ్చు కదా..? ఎందుకు చర్చలు జరపడం లేదు. ఎందుకు తిరగబడుతున్నారు. నోటికొచ్చినట్టు మాట్లాడడం మాత్రమే ముఖ్యమంత్రికి తెలుసు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై ఎందుకు దృష్టి పెట్టడం లేదు. హామీలు అమలు చేయమంటే నోటికొచ్చినట్టు తిడుతున్నవ్. ఇది సీఎం వైఖరి అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు మండిపడ్డారు. ఒక్క పంటకు కూడా రైతు బంధు లేదు. పదిహేను వేలు కాదు కదా..? ఉన్న పదివేలు కూడా రావడం లేదు. చివరకు పంటలు కొనే దిక్కు లేదని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లు జరగడం లేదు. రూ. 7521కు క్వింటాల్ పత్తి కొంటామని మద్దతు ధర ప్రకటించారు. కానీ రైతులు రూ. 5500కు పత్తి అమ్ముకుంటున్న పరిస్థితి. మద్దతు ధర రాకపోతే ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఉలుకుపలుకు లేదు. దిగాలుగా ఉన్న పత్తి రైతుకు.. అండగా నిలవడం లేదు. బోనస్ కాదు కదా.. మద్దతు ధర రావడం లేదు. వరంగల్, ఆదిలాబాద్, ఖమ్మంలో రైతులు రో÷-డడెక్కితే నీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోందని అన్నారు. కొబ్బరికాయలు కొడుతున్నారు.. కానీ ధాన్యం కొనుగోళు ్ల జరగడం లేదు. చివరకు వరి ధాన్యాన్ని రూ. 1900కు అమ్ముకుంటున్నారు. రైతులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. మక్క రైతులకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. సోయాబీన్ రైతులను పట్టించుకోవడం లేదు. రైతులను రోడ్డు మీదకు తీసుకొచ్చిన పరిస్థితి కాంగ్రెస్ పాలనలో దాపురించిందని హరీశ్‌రావు తెలిపారు.

పిఎసి సమావేశాన్ని బహిష్కరించిన బిఆర్ఎస్

(మొదటి పేజీ తరువాయి)

గాంధీ సూచించిన కే సీ.వేణుగోపాల్ పీఏసీ చైర్మన్ అయ్యారని తెలిపారు. అయితే కేసీఆర్ సూచించిన హరీష్ రావు నామినేషన్‌ను ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రతిపక్ష నేత కేసీఆర్ సూచించిన హరీష్ రావును పీఏసీ చైర్మన్‌ను చేయాలని డిమాండ్ చేశారు. అరికేపూడి గాంధీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అని మంత్రి శ్రీధర్ బాబు అంటున్నారని మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అధిష్ఠానానికి లేఖ రాశారన్నారు. పార్టీ మారిన పదిమంది ఎమ్మెల్యేలతో పోచారం శ్రీనివాస్ రెడ్డి ఇంట్లో రేవంత్ రెడ్డి సమావేశం అయ్యారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవాలని ఏఐసీసీ చెప్పిందని మహేష్ కుమార్ గౌడ్ అంటున్నారన్నారు. ఆస్తులు కాపాడుకునేందుకు ఎమ్మెల్యేలు పార్టీ మారారని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ చెప్పారన్నారు. పీఏసీ ఛైర్మన్ విషయంలో ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయం మార్చుకోవాలన్నారు. కేసీఆర్ సూచించిన వారిని పీఏసీ చైర్మన్‌గా నియమించాలని వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బుల్డోజర్ పాలిటిక్స్ చేస్తోందని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. అరికెపూడి గాంధీని పీఏసీ చైర్మన్‌గా అక్రమంగా నియమించారన్నారు. పీఏసీ చైర్మన్‌గా ఎవరు ఉండాలో నిర్ణయం తీసుకునే అధికారం కేసీఆర్‌కు ఉందని తెలిపారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు చెప్పినా చర్యలు తీసుకోలేదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డికి మండలి చీఫ్ విప్ ఇచ్చారని.. అరికెపూడి గాంధీ, పట్నం మహేందర్ రెడ్డిని అడ్డం పెట్టుకుని రేవంత్ రెడ్డి రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సాంప్రదాయాలకు ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతలే అంటున్నారని మాజీ మంత్రి తెలిపారు. ప్రజాస్వామ్య సూత్రాలకు ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందని ఎమ్మెల్సీ ఎల్.ర



రైతు రుణమాఫీ లిస్టును చూపిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్

కాంగ్రెస్‌తోనే రైతులకు న్యాయం

- ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్

మెదక్, అక్టోబర్ 28(నమస్తే ఉదయం): కాంగ్రెస్ హయాంలోనే రైతులకు న్యాయం జరుగుతుందని మెదక్ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ అన్నారు. సోమవారం మెదక్ నియోజకవర్గంలో మొత్తం గా 31364 వేల మంది రైతులకు 223 .29 కోట్ల రూపాయల రుణమాఫి జరిగిందని జిల్లా వ్యవసాయ శాఖ తరుపున నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ కి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ... రైతుకు రుణమాఫీ, విత్తనాలు, రైతు భరోసా పథకాలను తూచా తప్పకుండా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రైతు హితం కోసం సీఎం రేవంత్ రెడ్డి నిరంతనం ఆలోచిస్తూ ముందుకు సాగుతున్నారు అన్నారు.

ముత్యాలమ్మ ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

- ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్

మెదక్, అక్టోబర్ 28(నమస్తే ఉదయం): ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని మెదక్ శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ ఆకాం క్షించారు. సోమవారం చిన్న శంకరంపేట మండలం కామరం గ్రామం లోని ముత్యా లమ్మ అమ్మవారికి బోనాల పండుగ ఉత్సవాలలో ఎమ్మెల్యే రోహిత్ ముఖ్య అతిథిగా

చిన్న శంకరంపేటలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రోహిత్

పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోహిత్ మాట్లాడుతూ... మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేసే విధంగా ఆనవాయితిగా వచ్చే పండుగలను ఘనంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయం: ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, అక్టోబర్28(నమస్తే ఉదయం): మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు జిఎంఆర్ అన్నారు. సోమవారం మహారాష్ట్ర ఎన్నికల్లో భాగంగా ముంబై నగరంలోని మలద్

నామినేషన్ వేయడానికి వెళ్తున్న అభ్యర్థి ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

వెస్ట్ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి అస్లాం షేక్ నామినేషన్ కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. అభ్యర్థి అస్లాం షేక్ నామినేషన్ ఊరేగింపులో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతిని కలిసిన విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

రాజేంద్రనగర్, అక్టోబర్ 28 (నమస్తే ఉదయం): తెలంగాణా రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సోమవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్యని మర్యాదపూర్వకం గా కలిసారు. ఉదయం రాజేంద్ర నగర్ లోని విశ్వవిద్యాలయం పరిపాలనా భవనం లోని ఉపకులపతి కార్యాలయం లో వీరి భేటీ జరిగింది.రాష్ట్రం లోని విద్యారంగానికి సంబంధించిన వివిధ అంశాలపైన వీరిరువురూ చర్చలు జరిపారు.

ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యను కలిసి అభినందిస్తున్న విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

విశ్వవిద్యాలయంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్. :

విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవా లలో భాగంగా సోమవారం వ్యవసాయ విశ్వవిద్యా లయం పరిపాలనా భవనంలో అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ చేసారు.ఉపకులపతి ఆల్దాస్ జానయ్య ఆధ్వర్యంలో బోధన,బోధనేతర సిబ్బంది,ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఈ అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞ చేసారు.

తహసిల్దార్ రవీందర్ దత్‌కు మెమోరాండం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ విద్యార్తులు, తాసిల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న విద్యార్థులు

పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్స్ స్కాలర్షిప్స్‌ను వెంటనే విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కె.వై.ప్రణయ్

శంషాబాద్, అక్టోబర్ 27(నమస్తే ఉదయం): తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లొ ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్స్ ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.వై.ప్రణయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ శంషాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విద్యా ర్థులతో కలిసి శంషాబాద్ ఎమ్మార్వో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యరంగ సమస్యలను వెంటనే పరిష్క రించాలని ఎమ్మార్వో రవీందర్‌దత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కె వై ప్రణయ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 8 వేల కోట్ల దాకా ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ పెండింగ్ లో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యార్థులకు గత 6 సంవత్సరాల నుండి పెండింగ్ బకాయిలు విడుదల కాకపోవడంతో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు అన్నారు, గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రియం బర్స్మెంట్ డబ్బులు చెల్లించడం లేదని అన్నారు . ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థుల కాలేజీలకు. ప్రభుత్వం సొంత భవనాలను నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హర్ష, సతీష్, సాయి, స్పందన, సోనాలి,ప్రవళిక, తరుణ్, మహేష్,తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జాతీయ నూనె గింజల పరిశోధనల సమీక్షా సమావేశం

రాజేంద్రనగర్, అక్టోబర్ 28 (నమస్తే ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జాతీయ నూనె గింజల పరిశోధనల సమీక్ష, ప్రణాళికల రూప కల్పనకు ఉద్దేశించిన రెండు రోజుల జాతీయ సదస్సు సోమవారం వాటర్ టెక్నాలజీ సెంటర్‌లో ప్రారంభం అయింది. ఈ కార్యక్ర మంలో వివిధ రాష్ట్రాలకు చెందిన కుసుమ, అవిసెల పంటలపై పరిశోధనలు చేస్తున్న 150 మంది శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. వివిధ పరిశోధన అంశాలు, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికపై కూలంకుషంగా చర్చించారు.

ఈ కార్యక్రమంను ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం , జాతీయ నూనె గింజల పరిశోధన సంస (ఐ ఐ ఓ ఆర్) లు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి . ఈ కార్యక్రమానికి భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐ సీ ఏ ఆర్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. టి. ఆర్. శర్మ అధ్యక్షత వహించారు . ప్రస్తుతం ఇండియా రూ . 1.7 లక్షల కోట్ల రూపాయలు వెచ్చించి నూనెలని దిగుబడి చేసుకుంటున్నదని, దీని తగ్గించడానికి జాతీయ నూనె గింజల మిషన్ ని భారత ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. మనం చేసే పరిశోధనలు నూనె గింజ పంటల సాగును పెంచి, రైతులకు ఆర్థిక భరోసా కల్పించాలన్నారు. ముళ్ళు లేని కుసుమ రకాలను వృద్ధి చేయాలన్నారు. అన్ని పరిశోధన సంస్థలు సంయుక్తంగా పరిశోధనలు చేయడం వల్ల కుసుమ, అవిసెలలో చాలా నూతన రకాలను వృద్ధి చేయడం జరిగిందని శర్మ వివరించారు.

నూనె గింజల సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ టి కె శర్మ, సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు

ఐ సి ఏ ఆర్ అడిషనల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంజీవ్ గుప్త మాట్లాడుతూ, చాలా ప్రాంతాలలో కుసుమ, అవిసె పంటలకు ప్రాముఖ్యత పెరిగిందన్నారు. ముఖ్యంగా ఈ నూనె గింజల పంటలలో లైనోలేనిక్ ఆసిడ్ ఎక్కువగా ఉండడం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిదన్నారు. కానీ ఈ పంటల సాగు ఇంకా పెంచి రైతులకు ప్రోత్సాహం అందించాలని సూచించారు. వాచింతనగర్ లోని జాతీయ నూనెగింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ డా.మాథూర్ గత సంవత్సరం కుసుమ, అవిసెలలో చేపట్టిన పరిశోదన ఫలితాలను క్లుప్తంగా వివరించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ డా. జెల్లా సత్య నారాయణ మాట్లాడుతూ... వ్యవసాయ విశ్వవిద్యాలయం చాలా వరకు కుసుమ సాగును ప్రోత్సహిస్తూ రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం ను అందిస్తుందన్నారు. విశ్వ విద్యాలయం చీడ పీడలను తట్టుకునే రకాలను వృద్ధి చేయడమే కాకుండా కుసుమ నూనె కూడా ఉత్పత్తి చేసి రైతులకు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కుసుమ, అవిసెలు సాగు చేస్తున్న రైతులను సన్మానించారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం కు చెందిన ప్రధాన శాస్త్రవేత్త డా. సి. సుధాకర్ సమన్వయ కర్తగా వ్యవహరించి ప్రారంభ సమావేశంలో ముగింపు ఉపన్యాసం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వ విద్యాలయం ప్రతినిధులు, ప్రధాన శాస్త్రవేత్తలు, వివిధ రాష్ట్రాల కు చెందిన 150 మంది శాస్త్రవేత్తలు, విద్యార్థులు మరియు రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మీడియా పాలసీని తీసుకురావాలి

-ఎన్ యు జే ఐ జాతీయ ఉపాధ్యక్షులు పురుషోత్తం నారగౌని

వేములవాడ,అక్టోబర్ 28 (నమస్తే ఉదయం): ప్రభుత్వం మీడియా పాలసీని తీసుకురావాలని నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ (ఇండియా) ఎన్ యు జే ఐ జాతీయ ఉపాధ్యక్షులు పురుషోత్తం నారగౌని డిమాండ్ చేశారు. సోమవారం వేములవాడ లోని మొదటి బైపాస్ రోడ్ లోని ఇండియా టీవీ కార్యాలయంలో తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (టీఎస్ జేయు) రాజన్న సిరిసిల్ల జిల్లా సర్వ సభ్య సమావేశం జరిగింది సమావేశానికి టీఎస్ జేయు వేములవాడ నియోజకవర్గ అధ్యక్షులు కోడం కనకయ్య అధ్యక్షత వహించారు.

ఈ సమావేశానికి టీఎస్ జేయు రాష్ట్ర అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, కోశాధికారి పాపని నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ... జర్నలిస్టుల కోసం

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు సంక్షేమ పథకాలతో పాటు హెల్త్ కార్డులు, హౌసింగ్ సొసైటీలు, అక్రిడేషన్లు తదితర అంశాల విషయంలో రాష్ట్ర స్థాయిలో ఒక పాలసీని ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి జర్నలిస్టుకు యజమాన్యాలు జీతాలు ఇవ్వాలని ఆయన కోరారు. మనకోసం మనం జనం కోసం మనంగా జర్నలిస్టులు పనిచేయాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ఒకే జర్నలిస్టు సంఘాన్ని కాకుండా రిజిస్టర్ అయిన అన్ని సంఘాలను గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వమే నేరుగా దరఖాస్తులు స్వీకరించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా కొల్లూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా జి. నరేష్, కోశాధికారిగా సిహెచ్ ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా జె. మల్లేశం, టీ. నరసింహ స్వామి, ఏ. శ్రీనివాస్, దూస రాజేందర్, సంయుక్త కార్యదర్శిగా సిహెచ్. దేవదాస్, ఎన్. రామకృష్ణ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా సిహెచ్. బాబు, కార్యవర్గ సభ్యులు ఆర్. రాంప్రసాద్, బి. సంజయ్, బి బాలకృష్ణ, కె. మల్లేష్, జి. గణేష్, చందు, సురేష్, నరేష్, సంతోష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా అధ్యక్షులుగా ఎన్నికైన కొల్లూరి శ్రీనివాస్ మాట్లాడుతూ తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా యూనియన్ జాతీయ రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

దమ్ముంటే రాజీనామా చేసి పోటీ చేసి గెలువు..

తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్..
తెలంగాణ ద్రోహి మాధవరం కృష్ణారావు
95 శాతం అభివృద్ధి చేశాను అంటున్నావు
నీ ఇంట్లో నుంచి తెచ్చావా!!
బిజెపి, కాంగ్రెస్ ఒక్కటైతే సీఎం రేవంత్ రెడ్డి
బిజెపిని ఎందుకు తిడతాడు..
పార్లమెంట్ ఎన్నికల్లో
బీఆర్ఎస్ ఓట్లు బిజెపికి వేయించింది
నిజం కాదా!
హైడ్రా ముసుగులో బిఆర్ఎస్ హై డ్రామా.
కూకట్ పల్లి కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు
శేరి సతీష్ రెడ్డి.

కూకట్‌పల్లి,అక్టోబర్ 28 (నమస్తే ఉదయం): కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నీకు దమ్ముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తిరిగి ఎన్నికల్లో గెలవాలని కూకట్ పల్లి

కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి సవాల్ విసిరారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చెరువుల అభివృద్ధి పేరుతో చెరువు స్థలాలను మాయం చేసి, అక్రమంగా సంపాదించింది నిజం కాదా అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పార్టీ లోకి బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు అభివృద్ధి పేరుతో వస్తే రాజీనామా చేయాలని సవాల్ విసురుతున్నావు కదా. గతంలో నీకు టిడిపి వాళ్ళు ఓట్లు వేసి గెలిపిస్తే నువ్వు కూడా అభివృద్ధి పేరుతోనే కదా టిఆర్ఎస్ పార్టీలోకి పోయావు అప్పుడు నువ్వు రాజీనామా చేసావా అసలు నీకు దమ్ముంటే గత ఎన్నికల్లో 95 శాతం అభివృద్ధి జరిగిందని ఎన్నికల్లో కెళ్ళి ప్రజలు నిన్ను నమ్మి గెలిపించారు...!!! సరే అదే మాట ఇప్పుడు చెప్పి రాజీనామా చేసి ఇప్పుడు ఎన్నికల్లోకి రా!!! ఎమ్మెల్యే పదవి కి రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయాలని డిమాండ్ చేశారు. అసలు నువ్వు నమ్ముకున్న పార్టీకి మోసం చేసి టిఆర్ఎస్‌లో చేరలేవా? ఇది ప్రజలకు తెలియదా? అని అన్నారు. అభివృద్ధికి విఘాతం కలిగిస్తూ కాంగ్రెస్ పార్టీని విమర్శలు చేస్తే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు భవిష్యత్తులో రాజకీయ పుట్టగతలే ఉండవని అన్నారు.

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిందని, బిఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఉద్యమకారులపై అక్రమ కేసులు పెట్టించి ఉద్యమ కారులను అణిచివేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బిజెపి కాంగ్రెస్ ఒకటేనని మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గత పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్ కేడర్ తో బిజెపికి పని చేయించి ఓట్లు వేసి టిఆర్ఎస్ అభ్యర్థికి మోసం చేసింది నువ్వు కాదా అని ప్రశ్నించారు. కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో ఎవరు ఏ విధంగా రాజకీయాల్లో రాణిస్తారో కాలమే నిర్ణయిస్తుంది ఇది ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గమనించాలన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చిన్న పత్రికల అసోసియేషన్

చిన్న పత్రికల సమస్యలు పరిష్కరిస్తా..

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్ అక్టోబర్ 28 (నమస్తే ఉదయం): సమాచార పౌర సంబంధాల శాఖ, రెవిన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని తెలంగాణ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అండ్ మ్యాగజైన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. సోమవారం సెక్రటేరియట్ లోని మంత్రి ఛాంబర్ లో యూనియన్ నేతలు పలువురు కలిసి బర్త్ డే శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా చిన్న పత్రికలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను మంత్రి దృష్టికి తేగా ఆయా అంశాల పరిష్కారానికి యూనియన్ నేతలతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అండ్ మ్యాగజైన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాతాకుల అశోక్, ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు, జర్నలిస్ట్ యాంటి అటాక్స్ కమిటి సభ్యులు దాస్ మాతంగి, సీనియర్ పాత్రికేయులు వల్లపురెడ్డి రవీందర్ రెడ్డి, బొమ్మపాల వెంకటయ్య, జాన్ షహీద్, శ్రీనివాస్, అహ్మద్ అలీ, చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28(నమస్తే ఉదయం): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులకు సూచించారు.జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (35) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను

ప్రజావాణిలో కలెక్టర్ సంతోష్‌కు తన సమస్యను వివరిస్తున్న ప్రజలు

కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డిఓ రామచందర్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటి కప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

భిక్షాటన చేస్తున్న వృద్ధ మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణి చేసిన యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్

కూకట్‌పల్లి,అక్టోబర్ 28 (నమస్తే ఉదయం): శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్ కాలనీలో ఉంటూ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న వృద్ధ మహిళలకు హెూప్ ఆఫ్ హంగర్ చారిటబుల్ ట్రస్ట్ సంస్థ వారి సహకారంతో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ చేతులమీదుగా నిత్యావసర సరుకులు అందించడం జరిగింది. ఈ సందర్భంగా యువనేత మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల

నుండి తమ డివిజన్ లోని పేద ప్రజలకు సేవ చేస్తున్న హెూప్ ఆఫ్ హంగర్ సంస్థ వ్యవస్థాపకురాలు ఆలేఖ్యకు వారి బృందానికి కృతజ్ఞతలు తెలియచేసారు. రానున్న రోజుల్లో కూడా సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగించాలని సంస్థ వారిని కోరారు. కార్యక్రమంలో భారత్ గౌడ్, నరసింహులు, మల్లీశ్వరి, వెంకటేశ్వరరావు, రవి కిరణ్, అమూల్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ధన్వంతరి స్వామీ విగ్రహ ప్రతిష్ట స్వామీ వారి సామూహిక కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే కృష్ణా రావు, కార్పొరేటర్ రవీందర్ రెడ్డి...

కూకట్‌పల్లి,అక్టోబర్ 28 (నమస్తే ఉదయం): కూకట్ పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని సాయి నగర్ శ్రీ సాయి నాగేంద్ర ఆలయంలో శ్రీ ధన్వంతరి స్వామీ వారి విగ్రహ ప్రతిష్ట స్వామీ వారి సామూహిక కళ్యాణం లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి దేవాలయ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించిన కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు , బాలానగర్ డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంబటి సునీల్, దేవాలయ నిర్మాణం విగ్రహ దాత పి.త్రికోటేశ్వర రావు తోపాటు నాయకులు మందడి సుధాకర్ రెడ్డి,బొట్టు విష్ణు, దేవులపల్లి కృష్ణామూర్తి, వెంకటేశ్వర్లు, రంగంపేట్ శ్రీనివాస్ ముదిరాజ్, బాజని నాగేందర్ గౌడ్,ప్రేమ్ కుమార్, యం.సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ధరూర్, అక్టోబర్ 28(నమస్తే ఉదయం): ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు సోమవారం ధరూర్ మండల కేంద్రంలో డిప్యూటీ తహసిల్దారు అలివేలు మంగమ్మకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (TPUS) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావల్సిన 4 డి ఏ లు ,ఈ -కుబేర్ లో ఉన్న పెండింగ్ బిల్లులను విడుదల చేయలని , పి ఆర్ సి కమిటీ రిపోర్ట్ తెప్పించుకొని నవంబర్ 22వ వరకు పరిష్కరించాలని లేనియెడల 23 తేదీన హైదరాబాద్ లో ధర్మాగ్రహదీక్ష చేపడుతామని తమరి ద్వారా విజ్ఞప్తి చేస్తున్నాము.

ఈ కార్యక్రమంలో ధరూరు మండల తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ధరూర్ మండల అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి , సంఘం నాయకులు ప్రవీణ్ కుమార్ , లక్ష్మీనారాయణ, మోహన్ రెడ్డి,ఆంజనేయులు,మోహన్, హరి వంశీ ,రాజేష్, సురేష్, చక్రవర్తి , సురేందర్, బి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులు ఇవ్వాలని వినతి పత్రం అందజేస్తున్న అసోసియేషన్

21వ అఖిల భారత పశుగణన గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 28(నమస్తే ఉదయం): సోమవారం ఐ.డి. ఓ.సి సమావేశం హాల్ నందు పశు సంవర్ధక శాఖ ఏర్పాటు చేసిన పశుగణన కార్యక్రమ గోడప్రతులను జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... 21వ అఖిలభారత పశుగణన-తెలంగాణ సర్వే కార్యక్రమం జిల్లాలో ఈ నెల 25 నుండి ఫిబ్రవరి 28, 2025 వరకు కొనసాగుతుందని అన్నారు.ఈ ప్రక్రియలో ఆవులు, గేదెలు, గొర్రెలు,కోళ్ళు, మేకలు,ఇతర జంతువుల సమాచారాన్ని డిజిటల్ పద్ధతిలో మొబైల్ అనువర్తనం ద్వారా నిక్షిప్తంగా చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 12 మండలాలకి గాను ఒక నోడల్ ఆఫీసర్,12 మంది సూపర్వైసర్లు, 44 మంది ఎన్యుమేరేటర్లు కలిసి జిల్లాలోని ప్రతి నివాస గృహాన్ని సందర్శించి పశుఘనణ వివరాలు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. వివరాల సేకరణలో ప్రజా ప్రతినిధులు, పాడి రైతులు, పశు పోషకులు, గొర్లకాపర్లు ప్రతి ఒక్కరు సహకరించి కచితమైన సమాచారాన్ని అందించాలన్నారు.

పశు గణన వివరాల ద్వారా మాంసం గుడ్డు, పాల ఉత్పతులు గుణించి పశు సమవర్ధక రంగాబివ్రుద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు చేసుకోడానికి తోడ్పడుతుందని అన్నారు. తద్వారా భారత దేశ స్తూల జాతీయ ఉత్పత్తి (GDP) పెంచడానికి దోహదపడుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్ డి ఓ రామచందర్, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, మత్స శాఖ అధికారి షకీలా భాను, ఆర్డబ్ల్యూఎస్ ఏ.ఈ శ్రీధర్ రెడ్డి, వైద్యులు,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలి : చంద్రమోహన్

రాజేంద్రనగర్, అక్టోబరు 28(నమస్తే ఉదయం): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ వెల్ఫేర్ బోర్డు ఆన్ లైన్ సేవలు కార్మికులకు అందుబాటులోకి తెవాలని తెలంగాణ బిల్డింగ్, ఆదర్ కంస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం కాటేదాన్ లోని సిఐటియు కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులు సమావేశమయ్యారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు, పెండింగ్ కేసుల డబ్బులు విడుదల చేయాలని కోరారు.

ఆన్ లైన్ సేవలు గత నాలుగు నెలలుగా రావటం లేదని బేనినిపిషర్స్ అంతరాయాన్ని తోలగిం చాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయించాలన్నారు.

గత ప్రభుత్వం ఇస్తానన్న మోటార్ సైకిళ్ళు ఈ ప్రభుత్వం ఇవ్వాలన్నారు. కార్మిక శాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. వలస కార్మికుల చట్టం అమలుచేయాలన్నారు. కార్మిక శాఖ అధికారులు కార్మికుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఎల్ఐసి కంపెనీలకు ఇచ్చే విధానాన్ని రద్దు చేయాలన్నారు. కార్మికులకు పెన్షన్ విధానాన్ని అమలు చేయా లని, పెండింగ్ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేసారు. నిత్యావసర సరుకుల అధిక ధరలు తగ్గిం చాలని, పెట్రోల్, డిజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజా కార్మిక సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందారని మండిపడ్డారు

ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సిఐటియు కార్యదర్శి చంద్రమోహన్, రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు పెండ్యాల బ్రహ్మయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జిఎం, కురమయ్య, సుంకర రాంమోహన్, లు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో చైతన్య, పార్వతి,ముస్తాఫ, సంతొష్ కూమార్, శంకర్, చంద్రయ్య, సవీన్, సైదులు, లక్ష్మయ్య, శ్రీనివాస్, రాములు తదితరులు పాల్గొన్నారు..

కాటేదాన్ సిఐటియు కార్యాలయంలో సమావేశమైన భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

టీఎస్ జెయు సిద్దిపేట జిల్లా అధ్యక్షులుగా బాపురెడ్డి

సిద్దిపేట,అక్టోబర్ 28 (నమస్తే ఉదయం): తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీఎస్ జెయు) సిద్దిపేట జిల్లా కమిటీ సమావేశం సోమవారం శివాన్ భవ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ నాయకులు బాపురెడ్డి అధ్యక్షత వహించారు. సమావేశానికి నేషనల్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఇండియా) జాతీయ ఉపాధ్యక్షులు ఎన్. పురుషోత్తం, టీఎస్ జెయు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మెరుగు చంద్రమోహన్, తోకల అనిల్ కుమార్, కోశాధికారి పాపాని నాగరాజు ముఖ్యఅతిథులు హాజరయ్యారు. సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ జిల్లాలో జర్నలిస్టులందరికి ఇల్లు లేదా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే జర్నలిస్టుల నుంచి ఇండ్ల స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. మన కోసం మనం, జనం కోసం మనంగా జర్నలిస్టులు పని చేయాలని పురుషోత్తం అన్నారు. చిన్న పత్రికలను ఎంప్యానల్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షునిగా చింతలపల్లి బాపురెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరో పది రోజులలో పూర్తి స్థాయి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని వారు ప్రకటించారు. ఈ సందర్భంగా బాపురెడ్డి మాట్లాడుతూ తనను జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకున్న సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా జాతీయ, రాష్ట్ర నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో టీఎస్ జెయు జిల్లా నాయకులు కొత్తపల్లి రాజేందర్, గుడి భాను ప్రకాష్, బడుగు భాస్కర్, గుడిసె ప్రభు, బచ్చని శంకర్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published MEKALA DAMODAR REDDY on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733